సాక్షి విశాఖపట్నం

శనివారం । 20 । ఏప్రిల్ । 2024





ఎన్నికల ఆర్థిక లావాదేవీలపై పటిష్ట నిఘా 8లో



రెబెల్స్'
టీడీపీకి రెబెల్స్ బెడద వెంటాడుతోంది. మాడుగుల, అరకు, పాడేరు నియోజక వర్గాల్లో ఈ పరిస్థితి నెలకొంది. 8లో



నయన మనోహరం.. నృసింహ కల్యాణం 8లో

గంటాకు ఓటేస్తే నోటాకు వేసినట్టే..

- ఆయనకు ఓటేస్తే భూ మాఫియాను ప్రోత్సహించినట్టే..
- వైఎస్సార్ సీపీ కార్యకర్తలను ఇబ్బంది పెడితే తీవ్ర పరిణామాలు
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం : టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావుకు ఓటు వేసే కన్నా.. నోటాకు వేయడమే ఉత్తమమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. టీడీపీ హయాంలో గంటా భీమిలిని భ్రష్టు పట్టించారని... మరలా పొరపాటున అతనికి ఓటేస్తే భూ మాఫియాను ప్రోత్సహించిన వారవుతారన్నారు. ఆనందపురం జంక్షన్‌లో ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల వద్ద భూములు కొట్టేసే వారు గంటా శ్రీనివాసరావు సాయం తీసుకుంటున్నారంటే అర్థం ఏంటని ప్రశ్నించారు. ఆయన రియల్ ఎస్టేట్ బ్రోకర్లను ప్రోత్సహిస్తూ లబ్ధి పొందాలని చూస్తున్నాడన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులను టీడీపీలో చేర్చుకోవడానికి బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. భీమిలిని ఐదేళ్లు పాలించిన గంటా శ్రీనివాసరావుకు కనీసం 10 గ్రామాల ప్రజలైనా తెలుసా అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో ఏడాదికి ఒకసారైనా కార్యకర్తలను, నాయకులను పలకరించని ఆయన మళ్లీ భీమిలిలో భూ దోపిడీకి పాల్పడడానికే వస్తున్నాడని, అందరూ జాగ్రత్తపడాలన్నారు. టీడీపీ నాయకులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం చేయించారని, ఇంకా మరిన్ని సంఘటనలు చేయించడానికి ప్రజలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రజలను భయపెట్టి, మభ్యపెట్టి ఓట్లు వేయించుకోవడం... అనంతరం ప్రజలకు పంగనామాలు పెట్టడం టీడీపీ నాయకుల నైజమన్నారు. టీడీపీ అభ్యర్థి గ్రామాల్లోకి వస్తే ప్రజలకు ఏం చేశారని నిలదీయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

పక్షపాత వైఖరితో ఈనాడు రాతలు

భీమిలి నియోజకవర్గంలో 66 మంది సర్పంచ్‌లు ఉండగా 54 మంది వైఎస్సార్‌సీపీకి చెందిన వారేనని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. వారిలో ఒకరో ఇద్దరో తాయిళాలకు ఆశపడి పార్టీ మారితే భీమిలిలో వైఎస్సార్‌సీపీ ఖాళీ అని ఈనాడులో రోత రాతలు రాశారని ఆయన మండిపడ్డారు. టీడీపీకి ఈనాడు కరపత్రంగా మారిందని, అవాస్తవాలు రాస్తోందని ఆరోపించారు. టీడీపీ నాయకులు కక్షగట్టి తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసే విధంగా పోస్టులు పెడుతున్నారని, అలాంటి వాటిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటానన్నారు.

ఎంపీకి 6, అసెంబ్లీకి 22

రెండో రోజూ నామినేషన్ల జోరు

మహారాణిపేట: జిల్లా పరిధిలో ఎంపీ, అసెంబ్లీ స్థానాలకు నామినేషన్లు జోరందుకున్నాయి. విశాఖపట్నం పార్లమెంట్ స్థానానికి రెండో రోజు శుక్రవారం ఆరు నామినేషన్లు దాఖలు అయ్యాయి. జిల్లా పరిధిలోని ఏడు స్థానాలకు గానూ 5 అసెంబ్లీ స్థానాల్లో శుక్రవారం 22 నామినేషన్లు దాఖలయ్యాయి. ఆయా నియోజకవర్గాల ఆర్వో కార్యాలయాల్లో అభ్యర్థులు మొత్తం 27 సెట్ల నామినేషన్లు సమర్పించారు. రిటర్నింగ్ అధికారులు అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలు స్వీకరించారు. విశాఖ దక్షిణ, గాజువాక నియోజకవర్గాల పరిధిలో రెండో రోజు ఎవరూ నామినేషన్లు దాఖలు చేయలేదు. భీమిలి నుంచి ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు బుగత రాము, నాగామి నాగోతు ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలు రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. తూర్పు నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థులుగా వెలగపూడి రామకృష్ణ బాబు, వెలగపూడి సుజన రెండేసి సెట్లు నామినేషన్లు వేయగా, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి హైమావతి నామినేషన్ దాఖలు చేశారు. ఉత్తర నియోజకవర్గ పరిధిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా కేకే రాజు రెండు సెట్లు, కాంగ్రెస్ నుంచి గొంప గోవిందరాజు ఓ సెట్, స్వతంత్ర అభ్యర్థులుగా బి.రమేష్, కమ్మిల సుమ, రోణంకి చలపతిరావు ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలు రిటర్నింగ్ అధికారికి అందజేశారు. పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా ఆడారి ఆనంద్ కుమార్ రెండు సెట్లు, జై భారత్ నేషనల్ పార్టీ నుంచి జె. వెంకట గణేశ్ ఓ సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు.

పెందుర్తి నియోజకవర్గం స్థానంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా అన్నంరెడ్డి అదీప్‌రాజ్, జనసేన నుంచి పంచకర్ల మహాలక్ష్మి, పంచకర్ల రమేష్ బాబు, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా కె.మహదేవ్ కల్యాణ్ శ్రీకాంత్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా ఈత రోజా, సమాజ్ వాదీ పార్టీ నుంచి బోశం వెంకట మురళీమోహన్, స్వతంత్ర అభ్యర్థులుగా ఆడారి నాగరాజు, గుంటూరు వెంకట నరసింహరావు, గుంటూరు సాయిప్రియ, కూండ్రపు సన్యాసిరావు ఒక్కో సెట్ సమర్పించారు. ఇక విశాఖ ఎంపీ స్థానానికి బీఎస్పీ నుంచి పెదపెంకి శివప్రసాద్, దళిత బహుజన పార్టీ నుంచి బన్న రమేష్, స్వతంత్ర అభ్యర్థులుగా సొండి కృష్ణ, మొహమ్మద్ గౌస్ ముద్దీన్ ఖాన్, చప్పిడి రాము జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎ.మల్లికార్జునకు ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలు అందించారు. నవ భారత నిర్మాణ సేవా పార్టీ నుంచి చింతాడ సూర్యం రెండు సెట్లు సమర్పించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు జిల్లా ఎన్నికల అధికారి సమక్షంలో ప్రతిజ్ఞ చేశారు.



- సీఎం బస్సు యాత్రకు బ్రహ్మరథం
- పాయకరావుపేటలో ఘనంగా స్వాగతం
- హారతులిచ్చి దీవించిన మహిళలు
- వేలాదిగా తరలివచ్చిన అభిమానులు

నాడు..
ఒక్క అడుగు...
రాష్ట్రంలో సంక్షేమ చరిత్రను లిఖించింది..
అవ్వాతాతల మోముల్లో చిరునవ్వు విరబూయించింది..
అక్కా చెల్లెమ్మలకు ఆసరా ఇచ్చింది...
చిన్నారులను అమ్మ ఒడిలా లాలించి
విద్యాదీవెనలు అందించింది..
ప్రతి గుండెకు ఆరోగ్య సురక్షగా నిలిచింది
ప్రతి రైతుకు భరోసా ఇచ్చింది
లక్షలాది మందికి నీడనిచ్చింది...

ఆ మహాపథికుడు, జన హృదయాధినేత, సంక్షేమ రథసారథి

నేడు
కోట్లాది మంది ఆశీస్సులతో
మళ్లీ మనముందుకొచ్చాడు..
ఎన్నికల సమరానికి శంఖం పూరించి...
బస్సు యాత్రతో సిద్ధమై వచ్చాడు..
మండువేసవిలో చిరునవ్వుల
వెన్నెలై వచ్చాడు...
ఆ వెన్నెలలో తడిసి ముద్దయిన
వేలాది జనం జేజేలతో
సాదర స్వాగతం పలికారు...
జయహో...జగనన్న అంటూ
నీరాజనాలు పలికారు...



సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న వైవీ సుబ్బారెడ్డి

జయహో.. జగనన్న

సాక్షి, అనకాపల్లి, నక్కపల్లి : ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్షణాలు రానే వచ్చాయి. సంక్షేమం, అభివృద్ధి రెండు చక్రాలుగా రాష్ట్ర అభ్యుదయ రథాన్ని పరుగులు పెట్టిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర శుక్రవారం రాత్రి అనకాపల్లి జిల్లాలో అడుగుపెట్టింది. రాత్రి 9 గంటలకు సీఎం బస్సు యాత్ర జిల్లా సరిహద్దు పాయకరావుపేటకు చేరుకుంది. వేలాది మంది పార్టీ శ్రేణులు జాతీయ రహదారిపైకి వచ్చి సీఎం జగన్‌కు ఘన స్వాగతం పలికారు. తనను చూడడానికి వేలాదిగా తరలివచ్చిన జన సందోహానికి సీఎం జగన్ బస్సుపై నుంచి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడులను ప్రజలకు బస్సుపై నుంచే పరిచయం చేస్తూ రెండు చేతులు జోడించి ముందుకు సాగారు. వై **జంక్షన్‌లో మహిళలు హారతులివ్వడంతో పాటు గుమ్మడికాయలపై దీపాలు వెలిగించి దిష్టి తీసి జగ**న్న బస్సుయాత్ర ఏ ఆటంకాలు లేకుండా దిగ్విజయంగా పూర్తి కావాలని, మే 13న జరిగే ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధించి రెండోసారి ముఖ్యమంత్రి కావాలని దీవించారు. రాత్రి 9 గంటల సమయంలో కూడా పాయకరావుపేట పట్టణంతో పాటు వివిధ గ్రామాల నుంచి వేలాది మంది తరలిరావడంతో హైవే జన సంద్రమైంది. జై జగన్.. జైజై జగన్, మళ్లీ నువ్వే సీఎం అంటూ అభిమానులు నినాదాలు చేశారు. బస్సుయాత్రకు స్వాగతం పలికిన వారిలో పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, ఎంపీ గొల్ల బాబూరావు, అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎంఎస్ఎంఈ చైర్మన్, **మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, జిల్లా** వ్యవసాయ సలహామండలి చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు, జిల్లా పబ్లిక్ వింగ్ అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, ఎంపీపీ ఇసరపు పార్వతి తాతారావు తదితరులు ఉన్నారు.

గొడిచర్ల వద్ద రాత్రి బస

పాయకరావుపేట నుంచి నక్కపల్లి మండలం గొడిచర్ల హైవే పక్కన ఏర్పాటు చేసిన వసతి వద్ద సీఎం జగన్ రాత్రి బస చేశారు. గొడిచర్ల వద్ద రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనూరాధ, సర్పంచ్ అల్లు రమణ తదితరులు సీఎం జగన్‌కు స్వాగతం పలికారు.

మోగనున్న సమర శంఖం

సీఎం బస్సుయాత్ర జిల్లాలో శనివారం ఉదయం పాయకరావుపేట నియోజకవర్గం దొడ్డిగల్లు నుంచి ప్రారంభమై నాలుగు నియోజకవర్గాల్లో జరగనుంది. సార్వత్రిక ఎన్నికలకు తెరలేచిన తరువాత తొలిసారిగా జిల్లాకు వచ్చిన వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డికి బ్రహ్మరథం పట్టేందుకు ప్రజలు, పార్టీ శ్రేణులు సన్నద్ధమవుతున్నారు.

- నేడు అనకాపల్లి జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో సీఎం జగన్ యాత్ర
- 70 కిలోమీటర్ల మేర రోడ్ షో
- కశింకోట మండలం చింతలపాలెం వద్ద భారీ బహిరంగ సభ
- చిన్నయ్యపాలెం వద్ద సీఎం రాత్రి బస

సీఎం పర్యటన ఇలా...

సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం బస్సు యాత్ర శనివారం ఉదయం 9 గంటలకు పాయకరావుపేట నియోజకవర్గం గొడిచెర్ల నుంచి ప్రారంభమవుతుంది. ఉద్దండపురం, కాగిత, సీతంపాలెం, నక్కపల్లి, అడ్డరోడ్డు, పులపర్తి, రేగుపాలెం, యలమంచిలి బైపాస్ మీదుగా మధ్యాహ్నం 12.30 గంటలకు అచ్యుతాపురంలో గల లంచ్ పాయింట్ క్యాంప్‌కు చేరుకుంటారు. అనంతరం కశింకోట మండలం నరసింగపల్లి సమీపంలోని చింతలపాలెం వద్ద బహిరంగ సభ వేదిక వద్దకు చేరుకుంటారు. సాయంత్రం 4.30 గంటల నుంచి 5.30 గంటల వరకు జరిగే బహిరంగ సభలో సీఎం వై.ఎస్ జగన్ ప్రసంగిస్తారు. అనంతరం తాళ్లపాలెం జంక్షన్, బయ్యవరం, కశింకోట, కొత్తూరు, అనకాపల్లి జంక్షన్-1, జంక్షన్-2, శంకరం, రేబాక, మర్రిపాలెం టోల్‌గేట్, దేవీపురం, అస్కపల్లి మీదుగా రాత్రి 8.30 గంటలకు సబ్బవరం మండలంలోని చిన్నయ్యపాలెంలో గల టిర్రకాన్ రాయల్ వెంచర్ వద్దకు చేరుకుని అక్కడ రాత్రి బస చేయనున్నారు.



చురుగ్గా సభా ప్రాంగణం ఏర్పాట్లు

రెండు రోజుల్లో మేనిఫెస్టో

వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి

సీతమ్మధార: మరో రెండు రోజుల్లో మేనిఫెస్టో విడుదల చేస్తామని వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ విశాఖ ఉత్తర, పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థులు కె.కె.రాజు, ఆడారి ఆనంద్‌కుమార్ నామినేషన్ కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. నామినేషన్ ర్యాలీలకు ప్రభంజనంలా ప్రజలు తరలివచ్చారని, ప్రజల మద్దతుతో 175 స్థానాల్లోనూ గెలుస్తామన్నారు. ఉత్తరాంధ్రలో క్లీన్‌స్వీప్ చేస్తామన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టి మరింత అభివృద్ధి చేస్తామన్నారు. వైజాగ్ విజన్ పేరిట ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డాక్యుమెంట్ విడుదల చేశారని, ఆ డాక్యుమెంట్ ప్రకారం అభివృద్ధి చేస్తామన్నారు. ప్రభుత్వం చేసే అభివృద్ధే గెలిపిస్తుందని, ప్రజలంతా వైఎస్సార్ సీపీ వెంటే ఉన్నారన్నారు.

మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ బెదిరించారు

పందలపాక సర్పంచ్ ధవళ నాగేశ్వరరావు

ఆనందపురం: అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ తన ఇంటికి టీ తాగడానికి వచ్చి పార్టీ మారాలని బలవంతం చేశారని పందలపాక సర్పంచ్ ధవళ నాగేశ్వరరావు వెల్లడించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భీమిలి నియోజకవర్గంతో సంబంధం లేని వ్యక్తి వచ్చి పార్టీ ఫిరాయింపుని ప్రోత్సహించడం ఆశ్చర్యం కలిగించిందని చెప్పారు. వ్యాపారాలను దృష్టిలో పెట్టుకొని పార్టీ మారాలని తనను బలవంతం చేశారని, కుదరదని తేల్చి చెప్పేశానన్నారు. నాయకులను లొంగదీసుకోవడానికి టీడీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారని వివరించారు. తాను వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతానని, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి గెలుపునకు కృషి చేస్తానన్నారు. టీడీపీ నాయకుల బెదిరింపులకు లొంగనని చెప్పారు.

'పశ్చిమ'లో కొట్టాల్సిందే..



గోపాలపట్నం నూకాలమ్మ ఆలయం వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న ఆడారి ఆనంద్ కుమార్, చిత్రంలో వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, పార్టీ నాయకులు

గోపాలపట్నం: వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ నామినేషన్ ర్యాలీతో రహదారులు జనసంద్రంగా మారాయి. నియోజకవర్గం నలుమూలల నుంచి భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో సందడి నెలకొంది. వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు ఆడారి ఆనంద్‌కుమార్‌పై పూలవర్షం కురిపించారు. ముందుగా వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ గోపాలపట్నం నూకాలమ్మ ఆలయంలో అమ్మవారి పాదాల వద్ద నామినేషన్ పత్రాలు ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి ద్విచక్రవాహనాలు, కార్లతో ర్యాలీగా బయలు దేరారు. జన ప్రభంజనం మధ్య ఎన్ఏడీ జంక్షన్, కరాసా, కంచరపాలెం మెట్టు మీదుగా జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయానికి చేరుకుని అక్కడ పూజలు చేశారు. తర్వాత జ్ఞానాపురం జోన్-5 కార్యాలయంలో తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి హుస్సేన్ సాహెబ్‌కు ఆడారి ఆనంద్‌కుమార్ అందించారు. ఆయన వెంట డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, ఆనంద్‌కుమార్ అక్క పీలా రమాకుమారి, కార్పొరేటర్ పి.వి.సురేష్ ఉన్నారు. కార్యక్రమంలో పశ్చిమ ఎన్నికల పరిశీలకుడు ఎస్.ఎ.రెహమాన్, పీలా ఉమారాణి, పేడాడ రమణి కుమారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



ఎన్నికల రిటర్నింగ్ అధికారి హుస్సేన్ సాహెబ్‌కు నామినేషన్ పత్రాలు అందిస్తున్న వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్

కంచరపాలెం: వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ తన పేరిట చర, స్థిరాస్తులు రూ.15,93,61,699 ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఆనంద్‌కుమార్‌పై ఎలాంటి క్రిమినల్ కేసులు నమోదు కాలేదు.

ఆనంద్ కుమార్ భార్య మాలతి పేరు మీద వివిధ బ్యాంకుల్లో రూ.23,20,277 నగదు డిపాజిట్లు, వివిధ సంస్థల్లో రూ.2,87,87,544 పెట్టుబడులు, రూ.39,26,412 బంగారం, ఇతర విలువైన వస్తువులు, రూ.22,44,087 భూములు, వ్యక్తిగత లోన్లు ఉన్నాయి.

ఉత్తరలో జెండా ఎగరాలి



ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్సార్ సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు, ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి

సీతంపేట: వైఎస్సార్ సీపీ విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా కె.కె.రాజు నామినేషన్ అట్టహాసంగా సాగింది. ముందుగా కె.కె.రాజు సతీసమేతంగా బెల్లం వినాయకుడికి పూజలు చేశారు. అనంతరం కనకమహాలక్ష్మి అమ్మవారు, లలితానగర్‌లోని లలిత అమ్మవారు, తాటిచెట్లపాలెంలో పరదేశమ్మ, సింహాచలంలో వరహా లక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకున్నారు. ఆర్అండ్‌బీ వద్ద పైడితల్లి అమ్మవారికి పూజలు చేశారు. ఎన్జీజీవో స్కాలనీలోని వైభవ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ప్రచార రథంపై వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్, ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వీఎంఆర్డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళితో కలిసి అభిమానుల భారీ బైకు ర్యాలీ నడుమ సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్, డీఎల్‌బీ గ్రౌండ్స్, పోర్టు హాస్పిటల్, పోర్ట్‌టౌన్ పోలీస్ స్టేషన్ మీదుగా ఉత్తర పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి పాదయాత్రగా అభయాంజనేయస్వామి, ఎస్ఎఫ్ఎస్ స్కూల్, అల్లూరి విగ్రహం మీదుగా సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ రిటర్నింగ్ ఆఫీసర్ డి.అఖిలకు నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఆయన వెంట ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి, కె.కె.రాజు సతీమణి సుమ, ఉత్తర ఎన్నికల పరిశీలకులు బానాల శ్రీనివాసరావు, చొక్కాకుల వెంకటరావు, సీనియర్ నాయకుడు బి.కాశీవిశ్వనాథం ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, వార్డు కార్పొరేటర్లు, అధ్యక్షులు పాల్గొన్నారు.



ఆర్వో అఖిలకు నామినేషన్ పత్రాలు అందిస్తున్న వైఎస్సార్ సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు, చిత్రంలో ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి, చొక్కాకుల వెంకటరావు, కాశీ విశ్వనాథం

సీతమ్మధార: వైఎస్సార్ సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు తన పేరు మీద రూ.42,27,75,132 స్థిర, చరాస్తులు ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. వివిధ బ్యాంకుల నుంచి రూ.20,36,48,977 మేర రుణాలు ఉన్నట్లు తెలిపారు. అతని భార్య సుమ పేరు మీద రూ.2,02,08,386 చరాస్తులు, రూ.5,17,87,000 స్థిరాస్తులు ఉన్నాయి. నిరసనల నేపథ్యంలో ఆయనపై మూడు కేసులు నమోదయ్యాయి.

డబుల్ విక్టరీ కోసం



నామినేషన్‌కు తరలివెళుతున్న వైఎస్సార్ సీపీ పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి అదీప్‌రాజ్, నాయకులు

పెందుర్తి: పెందుర్తి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. పెందుర్తి రెవెన్యూ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి పి.శేషశైలజకు నామినేషన్ పత్రాలు అందజేశారు. ముందుగా ఇంటి వద్ద తల్లిదండ్రులు సత్యనారాయణ, రామలక్ష్మి ఆశీర్వచనం తీసుకున్న అదీప్‌రాజ్ రాంపురం నుంచి కార్యకర్తలు, నాయకులు కార్ల ర్యాలీ నడుమ పెందుర్తి చేరుకున్నారు. నియోజకవర్గం నలుమూలల నుంచి భారీ ఎత్తున కార్యకర్తలు, నాయకులు తరలివచ్చారు. రాంపురం నుంచి పెందుర్తి రైల్వే ఓవర్ వంతెన నుంచి వెలంపేట, పెందుర్తి నాలుగు రోడ్ల కూడలి, పెందుర్తి పాత ప్రభుత్వ ఆస్పత్రి కూడలి మీదుగా జూనియర్ కళాశాల వరకు బీఆర్‌టీఎస్ రహదారిపై కార్లుతో ర్యాలీ వెల్లువలా సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడును గెలిపించాలని అభ్యర్థించారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బయిలపూడి భగవాన్ జయరామ్, సీఈసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, కార్పొరేటర్‌లు ముమ్మన దేముడు, బట్టు సూర్యకుమారి, ఎంపీపీ మధుపాడ నాగమణి, జెడ్పీటీసీ సభ్యులు ఉప్పిలి దేవి, రాజు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోడిగుడ్ల దేవిసాంబ, పెందుర్తి నియోజకవర్గ పరిశీలకుడు తిప్పల గురుమూర్తిరెడ్డి, పార్టీ నేతలు గండి రవికుమార్, చుక్కా రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఆర్వో శేష శైలజకు నామినేషన్ పత్రాలు అందిస్తున్న పెందుర్తి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అదీప్‌రాజ్

వైఎస్సార్ సీపీ పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తన పేరిట రూ.2 కోట్ల వరకు స్థిరాస్తులు ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ప్రత్యేక హోదా ఉద్యమంలో భాగంగా పెందుర్తి రైల్వేస్టేషన్ వద్ద రైల్‌రోకో నిరసనపై అదీప్‌రాజ్‌పై కేసు నమోదైంది. సింహాచలం దేవస్థానం పంచగ్రామాల భూ సమస్య పరిష్కారం కోసం 2015లో చేపట్టిన నిరాహార దీక్షపై మరో కేసు అదీప్‌రాజ్‌పై నమోదు కాగా.. అవి ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉన్నాయి.

ఎన్నికల నియమావళికి గంటా తూట్లు


మధురవాడ పవన్‌మిత్ర అపార్ట్‌మెంట్‌లో రాత్రి 10.20 గంటలకు ప్రచారం నిర్వహిస్తున్న గంటా

మధురవాడ: భీమిలి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు ఎన్నికల నియమావళికి తూట్లు పొడిచారు. జీవీఎంసీ 5వ వార్డు వైఎస్సార్ కాలనీ, గాయత్రీ మెడికల్ కళాశాల సమీపంలోని పవన్ మిత్ర అపార్ట్‌మెంట్ వద్ద రాత్రి 10 గంటల తర్వాత కూడా ఎన్నికలు ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ కాలనీలో టీడీపీ నాయకులు రాత్రి 10 గంటలకు బాణసంచా కాల్చారు. తర్వాత రోడ్డు మధ్యలోనే ఫొటోలు దిగుతూ గంటా అభివాదం చేశారు. రాత్రి 10.15 గంటలకు పక్కనే ఉన్న పవన్ మిత్ర అపార్ట్‌మెంట్‌లోకి వెళ్లి ప్రచారం చేశారు. 10.25 గంటలకు వైఎస్సార్ కాలనీలో మహిళలతో ముచ్చటించి గ్రూప్ ఫొటో దిగారు. అర గంట పాటు ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి గంటా ప్రచారం నిర్వహించినా అధికారులు, పోలీసులు ఇటువైపు కన్నెత్తి చూడలేదు.

ఎన్నికల ప్రచారంలో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఉద్యోగులు(సర్కిల్స్)

విశాఖపట్నం: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తూ కొంత మంది స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం చర్చనీయాంశమైంది. స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ బిల్డింగ్ కూడలి వద్ద టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు కోగంటి లెనిన్‌బాబు, కొల్లి నాగేశ్వరరావు, గుమ్మడి నరేంద్రకుమార్, చీపురుపల్లి శ్రీనివాసరావు, ఎం.మహాలక్ష్మినాయుడు, ఎ.మణికుమార్ పాల్గొన్నారు. వారి తీరుపై సహ ఉద్యోగులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఎన్నికల నిబంధనలు పట్టించుకోకుండా ప్రచారంలో పాల్గొన్న ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

నయన మనోహరం.. నృసింహ కల్యాణం

- కనువిందుగా ఎదురు సన్నాహోత్సవం
- వైభవంగా రథోత్సవం
- పరవశించిన భక్తజనం
- సింహగిరికి కల్యాణ సిరి


నృత్య నీరాజనం: సింహగిరి మాడ వీధుల్లో కోలాటం


రథోత్సవంలో పాల్గొన్న శారదాపీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి


ఎదురు సన్నాహోత్సవంలో పూలమాలలతో నృత్యం చేస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరి కల్యాణ సిరిని సంతరించుకుంది. చైత్రశుద్ధ ఏకాదశి వేళ శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవం శుక్రవారం రాత్రి నయనానందకరంగా జరిగింది. శ్రీ మహా విష్ణువు అవతారమైన వరాహ లక్ష్మీ నృసింహస్వామిని పెళ్లి కుమారుడిగా, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను పెళ్లి కుమార్తెలుగా దర్శించిన భక్తులు తన్మయులయ్యారు.

కొట్నాల ఉత్సవంతో శ్రీకారం

పాంచరాత్ర ఆగమ శాస్త్రాన్ని అనుసరించి కల్యాణోత్సవ ఘట్టాలను ఆలయ అర్చకులు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభించారు. తొలుత ఆలయ నీలాద్రి గుమ్మం వద్ద అర్చకులు, ముత్తయిదువలు పసుపుకొమ్ములను దంచి కొట్నాల ఉత్సవాన్ని నిర్వహించారు. తదుపరి ముక్కోటి దేవతలకు కల్యాణోత్సవ ఆహ్వానాన్ని పలుకుతూ ఆలయ ధ్వజస్తంభం వద్ద అర్చకులు గరుడాళ్వార్ చిత్రపటాన్ని ఎగరవేసి ధ్వజారోహణ నిర్వహించారు.

రసవత్తరంగా ఎదురు సన్నాహోత్సవం

స్వామి వారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని బంగారురంగు పల్లకీలో.. శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ముత్యాల పల్లకీలో కొలువుదీర్చారు. ఈ పల్లకీలను సింహగిరి మాడవీధుల్లో చెరొకవైపు తీసుకెళ్లి పశ్చిమ మాడ వీధిలో జోడు భద్రాల వద్ద ఎదురెదురుగా ఏర్పాటు చేసిన వేదికలపై అధిష్ఠింపజేశారు. స్వామివారు, అమ్మవార్ల వైభవాన్ని, గొప్పతనాన్ని చాటిచెబుతూ జరిగిన ఎదురు సన్నాహోత్సవం ఆద్యంతం రసవత్తరంగా సాగింది. ఆలయ అర్చకులు పూలదండలతో నృత్యాలు చేస్తూ ఎదురు సన్నాహోత్సవాన్ని రక్తి కట్టించారు. వ్యాఖ్యాతలుగా రావులపాలేనికి చెందిన కందుకూరి రామకృష్ణ సూర్యనారాయణ, కందుకూరి సత్య సూర్యనారాయణమూర్తి వ్యవహరించారు.

నేత్రపర్వం..రథోత్సవం

సింహగిరి మాడ వీధుల్లో స్వామివారి రథోత్సవం నిర్వహించారు. రథంలో ఉన్న స్వామివారిని దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు తొలి దర్శనం చేసుకున్నారు. అనంతరం జాలరి పెద్ద కదిరి లక్ష్మణరావు రథ సారథిగా నిలిచి రథ కదలికలను సూచిస్తుండగా, లక్ష్మీదేవి అమ్మవారి బంధువులుగా జాలర్లు రథం నడిపే బాధ్యతలు చేపట్టారు. అశేష భక్తజన సందోహం రథాన్ని తాళ్లతో లాగి పరవశించారు. విశాఖ శ్రీ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి, నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్, దేవస్థానం ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యులు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్ తదితరులు స్వామిని దర్శించుకున్నారు.

కనులపండువగా కల్యాణోత్సవం

సింహగిరిపై ఉన్న నృసింహ మండపంలో రాత్రి 10.30 గంటల నుంచి వార్షిక కల్యాణోత్సవం జరిపించారు. స్వామివారిని, అమ్మవార్లను నృసింహ మండపంలోకి తీసుకొచ్చి, భారీ ఎత్తున ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై కొలువుదీర్చి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తదుపరి భక్తులకు ముత్యాల తలంబ్రాలు, ప్రసాదం అందజేశారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు, వేదపండితులు కార్యక్రమాన్ని నిర్వహించారు. సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. సీపీ రవిశంకర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. డీసీపీ సత్తిబాబు, నార్త్ ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

రథోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విజయనగరం జిల్లా గాజులరేగకు చెందిన దాసరి రాము ట్రూప్ పులివేషాలు, విజయనగరం జిల్లా వేపాడకు చెందిన సింహాద్రి అప్పన్న గరిడి నృత్యం, విశాఖలోని దువ్వాడకు చెందిన నూకాంబిక ట్రూప్ కోలాటం, వడ్లపూడికి చెందిన వెంకట పరమేశ్వరి అన్నమయ్య సంఘం మహిళల కోలాటం, కూర్మన్నపాలేనికి చెందిన శ్రీ బాలాజీ త్రిశక్తి కోలాటం సంఘం మహిళలు చేసిన నృత్యం, మాధవధారకు చెందిన లలిత వైభవ కోలాటం, విజయనగరానికి చెందిన పులివేషాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు


మహిళల సాంస్కృతిక ప్రదర్శన


ఆకట్టుకున్న పులివేషాలు

రె'బెల్స్'

- టీడీపీలో కొనసాగుతున్న సీట్ల ఫైట్
- మాడుగుల అభ్యర్థిగా పైలా నామినేషన్
- మాడుగుల అభ్యర్థిగా 22న నామినేషన్ వేస్తానని బండారు ప్రకటన
- పాడేరు నుంచి నామినేషన్ వేసిన కిల్లో రమేష్ నాయుడు
- టికెట్ మార్చి గిడ్డి ఈశ్వరికి ఇస్తారంటూ జోరందుకున్న ప్రచారం
- అరకులో చంద్రబాబుపై యుద్ధం ప్రకటించిన సివేరి అబ్రహం
- అదే బాటలో దొన్నుదొర.. నామినేషన్ వేసేందుకు సిద్ధం

సాక్షి, విశాఖపట్నం: వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్‌గా మారిన టీడీపీ అధినేత చంద్రబాబు టికెట్ల కేటాయింపు విషయంలోనూ అదే పద్ధతి పాటిస్తున్నారు. తొలుత ప్రకటించిన అభ్యర్థులను మార్చుతారన్న సంకేతాలు రావడంతో ఆ పార్టీ నేతలు అధినేత తీరుపై మండిపడుతున్నారు. మరో వైపు నామినేషన్లు వేసిన తర్వాత కూడా అభ్యర్థులను మార్చుతారన్న సంకేతాలు రావడంతో భంగపడ్డ నాయకులు టీడీపీ రెబల్స్‌గా బరిలోకి దిగడానికి సిద్ధమయ్యారు. మాడుగుల, పాడేరు, అరకు.. ఇలా ప్రతిచోటా రెబెల్స్ మోగుతున్నాయి. దీంతో తిరుగుబావుటా ఎగరేసిన వారికి తాయిళాలు.. నామినేటెడ్ పదవులు ఇస్తామని జపిస్తున్నా.. చంద్రబాబు మాటలు నమ్మడం లేదు. అసలు ఎన్ని పదవులు ఉంటాయి.. ఒకే పదవి ఎంత మందికి ఇస్తారు.. అని భావించిన టికెట్ రాని టీడీపీ నేతలు రెబల్స్‌గా బరిలో దిగుతామని స్పష్టం చేస్తున్నారు. మరికొన్ని చోట్ల టికెట్ ఆశించి భంగపడిన వారంతా లోలోపల రగిలిపోతున్నారు.

బండారు ఇన్.. పైలా అవుట్ !

మాడుగుల టికెట్ పైలా ప్రసాద్‌కు కేటాయించారు. దీంతో ఆయన శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. అయితే బీ ఫారం ఇవ్వకముందే.. బండారు సత్యనారాయణమూర్తి తనకే టికెట్ ఇస్తారని నియోజకవర్గంలోకి ఎంట్రీ ఇచ్చారు. దీంతో పైలాకు చంద్రబాబు వెన్నుపోటు పొడిచారనే ప్రచారం సాగుతోంది. ఒకే వేళ తన సీటు మార్చితే లోకల్‌గా ఉన్న గవిరెడ్డి లేదా కుమార్‌కు ఇచ్చినా తాను సహకరిస్తాను తప్పా ఎక్కడి నుంచో వచ్చిన బండారుకు సహకరించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. నామినేషన్ వేసి అధిష్టానానికి హెచ్చరికలు జారీ చేశారు. తనను కాదని బండారుకి టికెట్ ఇస్తే.. ఆయన బండారం బయటపెట్టి.. ఎలా నెగ్గుతారో చూస్తానంటూ సవాల్ విసిరారు.

అరకులో డబుల్ ధమాకా..

అరకు నియోజకవర్గంలో టీడీపీకి రెబల్ పోటు తప్పేలా లేదు. రాష్ట్రంలోనే మొట్టమొదటగా చంద్రబాబు ప్రకటించిన టికెట్ అరకులోయే. ఈ స్థానంలో టీడీపీ తరపున దొన్నుదొర నిలబడుతున్నారంటూ ప్రజలందరి ముందు ప్రకటించారు. చివరికి ఆ టికెట్‌ను బీజేపీకి కేటాయించారు. దీంతో దొన్నుదొర చంద్రబాబుపై యుద్ధం ప్రకటించారు. ఇదే స్థానం కోసం ఆశలు పెట్టుకున్న అబ్రహంను కూడా చంద్రబాబు నడిరోడ్డుపై వదిలేశారు. దీంతో అబ్రహం, దొన్నుదొర ఇద్దరూ చంద్రబాబు తీరుపై రగిలిపోతున్నారు. కూటమి తరపున బీజేపీ అభ్యర్థి పాంగి రాజారావు శుక్రవారం నామినేషన్ దాఖలు చేయగా.. ఇండిపెండెంట్ అభ్యర్థిగా అబ్రహం కూడా నామినేషన్ వేశారు. దొన్నుదొర కూడా 24న నామినేషన్ వేస్తానని ప్రకటించారు.

అక్కడా తిరుగుబావుటా...!

పాడేరు, రంపచోడవరం నియోజకవర్గాల్లోనూ అసమ్మతి రగులుతోంది. పాడేరు టికెట్ ఆశించి భంగపడిన గిడ్డి ఈశ్వరి రెబల్‌గా బరిలోకి దిగుతానంటూ హెచ్చరించారు. అయితే.. కిల్లు రమేష్ నాయుడుకు హ్యాండ్ ఇచ్చి.. గిడ్డి ఈశ్వరికి టికెట్ ఇస్తారనే ప్రచారం జరుగుతోంది. ఒకవేళ బీ-ఫారం ఈశ్వరికి ఇస్తే.. తాను రెబల్‌గా పోటీ చేస్తానని కిల్లు హెచ్చరించారు. రంపచోడవరంలోనూ వంతల రాజేశ్వరి తిరుగుబాటు అభ్యర్థిగా బరిలో నిలిచి.. గెలిచి.. చంద్రబాబు, లోకేష్‌కు తన సత్తా చూపిస్తానని సవాల్ విసురుతున్నారు. ఇలా.. ప్రతి చోటా టీడీపీకి రెబల్స్ ఉచ్చు బిగుసుకుంటోంది. తిరుగుబాటు చేస్తామన్న నాయకులందర్నీ పిలిపించి అధికారంలోకి వస్తే ఎమ్మెల్సీ ఇస్తానంటూ చంద్రబాబు బుజ్జగిస్తున్నారు. బాబు హామీలను గమనించిన అసంతృప్త నేతలు అధికారంలోకి రాక ముందు హ్యాండి ఇచ్చి.. అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోరని మండిపడుతున్నారు. ఎన్నికల్లోనే తాడోపేడో తేల్చుకుంటామని స్పష్టం చేస్తున్నారు.

30న జెడ్పీ సర్వసభ్య సమావేశం

ఎంవీపీకాలనీ: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 30న నిర్వహించనున్నట్లు జిలా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి ఎం.పోలినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి అనుగుణంగా సమావేశంలో నిర్ణయాలు ఉంటాయన్నారు. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర అధ్యక్షతన జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈ సమావేశం ఉంటుందని వెల్లడించారు.

పంచకర్లకు కారు లేదట

- అఫిడవిట్‌లో పేర్కొన్న జనసేన అభ్యర్థి
- స్వస్థలం మచిలీపట్నంలో 7 వేల గజాల స్థలాలు

పెందుర్తి: పెందుర్తి జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్ బాబుకు సొంత కారు లేదు. శుక్రవారం నామినేషన్ వేసిన ఆయన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తన స్వస్థలం మచిలీపట్నంలో దాదాపు 7 వేల గజాల స్థలాలు ఉన్నట్లు వివరించారు. దాదాపు రూ.10 కోట్ల విలువైన ఆస్తులు, బంగారం తనకు, తన భార్య పేరిట ఉన్నాయని చెప్పారు. రూ.5 కోట్ల వరకు రుణాలు ఉన్నట్లు తెలిపారు.

ప్రయాణికులకు ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం : ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖపట్నం - బెంగళూరు - విశాఖపట్నం మధ్య సమ్మర్ స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం - ఎస్ఎంవీ బెంగళూరు (08549) సమ్మర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ శనివారం విశాఖపట్నంలో మధ్యాహ్నం 1.15 గంటలకు బయల్దేరి, మరుసటిరోజు ఉదయం 7.30 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు జూన్ 29 వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఎస్ఎంవీ బెంగళూరు - విశాఖపట్నం (08550) సమ్మర్ స్పెషల్ ప్రతీ ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు బెంగళూరులో బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు జూన్ 30 వరకు నడుస్తుంది. ఈ రైళ్లు ఇరు మార్గాల్లో దువ్వాడ, రాజమండ్రి, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడ్, జోలర్‌పేట, కృష్ణరాజపురం స్టేషన్లలో ఆగుతాయి.

హత్యాయత్నం కేసులో ఐదేళ్ల జైలు

విశాఖ లీగల్ : వివాహేతర సంబంధం నేపథ్యంలో ఓ వ్యక్తిని హత్య చేసేందుకు యత్నించిన నిందితునికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ నగరంలోని రెండో అదనపు జిల్లా న్యాయస్థానం న్యాయమూర్తి ఎం.వెంకటరమణ శుక్రవారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆ తీర్పులో పేర్కొన్నారు. ఇన్‌చార్జి పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వరరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు డోలా సాయి (23) నగరంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కొబ్బరితోట నివాసి. రౌడీ షీటర్‌గా స్థానికంగా పెత్తనం చెలాయించేవాడు. ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్న సాయి... ఆ బంధానికి సదరు మహిళ భర్త అడ్డం వస్తున్నాడని పలుమార్లు అతడిని హెచ్చరించాడు. అయినా మాట వినకపోవడంతో 2018 అక్టోబర్ 20న అతని మెడపై కత్తితో సాయి బలంగా గాయపరిచాడు. బాధితుని ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు డోలా సాయిపై కేసు నమోదు చేశారు. విచారణ జరిపిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో పైవిధంగా తీర్పు చెప్పారు.

ఎన్నికల ఆర్థిక లావాదేవీలపై పటిష్ట నిఘా

- బాధ్యతగా ఎన్నికల విధులు
- జిల్లా అధికారులతో రాష్ట్ర వ్యయ పరిశీలకులు నీనా నిగం
- నియోజకవర్గాల వారీగా సమీక్షలు

మహారాణిపేట: ఎన్నికల సమయంలో అభ్యర్థులతో పాటు ఆర్థిక లావాదేవీలు, ఖర్చులు, ఇతర వ్యయాలపై పటిష్ట నిఘా ఉంచాలని జిల్లా అధికారులను రాష్ట్ర వ్యయ పరిశీలకులు నీనా నిగం ఆదేశించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాల్సి ఉందని స్పష్టం చేశారు. విశాఖ పార్లమెంట్ వ్యయ పరిశీలకులు రంగ రాజన్, భీమిలి, తూర్పు, దక్షిణ అసెంబ్లీ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు సౌమ్య పాండేజైన్, ఉత్తర, పశ్చిమ, గాజువాక, పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు అక్తాజైన్‌తో కలిసి శుక్రవారం జిల్లాలో నీనా నిగం పర్యటించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నియోజకవర్గాల వారీగా సమీక్షా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్థిక లావాదేవీలు, నగదు బట్వాడా, బహుమతులు, ఇతర వస్తువుల తరలింపు, మద్యం రవాణా తదితర అంశాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. అధికారులందరితో నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ ఎన్నికలను అత్యంత పారదర్శకంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. సమాచార లోపం తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏమైనా సందేహాలుంటే రాష్ట్ర, జిల్లా స్థాయి ఎన్నికల అధికారులతో సంప్రదింపులు చేసి నివృత్తి చేసుకోవాలన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : పార్టీలు గానీ, అభ్యర్థులు గానీ అనధికారికంగా ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయడానికి వీలులేదని, వారు చేసే ఆర్థిక లావాదేవీలపై నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని నీనా నిగం చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రత్యేక గ్రీవెన్స్ కమిటీ ద్వారా సాధారణ పౌరుల నుంచి జప్తు చేసిన నగదును ఆధారాలు పరిశీలించి త్వరితగతిన వెనక్కి ఇచ్చేయాలని సూచించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, నగర పోలీస్ కమిషనర్ డా.ఎ.రవిశంకర్, ఎంసీసీ నోడల్ అధికారి, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, ఏడీసీ కె.ఎస్.విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, ఇతర విభాగాల ఉన్నతాధికారులు ఆయా విభాగాల ఆధ్వర్యంలో చేపట్టిన చర్యల గురించి ఆమెకు వివరించారు.

క్షేత్రస్థాయిలో చర్యలు, సేవలు

కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ 11 చోట్ల చెక్ పోస్టులు పెట్టామని, ఇప్పటి వరకు వస్తు, ధన రూపంలో రూ.4.92 కోట్ల నగదును సీజ్ చేశామని తెలిపారు. మొత్తం 110 రకాల బృందాలు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నాయని, నగదు తరలింపు, మద్యం రవాణాపై నిఘా ఉంచుతున్నాయని వివరించారు. 24/7 పనిచేసేలా కంట్రోల్ రూమ్ నుంచి సేవలందిస్తున్నామని పేర్కొన్నారు. 16 మంది నోడల్ అధికారులను నియమించామని, 502 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, 1,457 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ పెట్టేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. సీ-విజిల్ ద్వారా 388 వినతులు రాగా.. 285 వినతులను నిర్ణీత సమయంలో పరిష్కరించామని తెలిపారు. ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించిన ఘటనల్లో 59 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయన్నారు.